
సాక్షి ఒడిశా

ఆదివారం । 12 । మే । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,84,165లు, బంగారం 40 గ్రాములు, వెండి 146 గ్రాముల 500 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



మూగబోయిన మైకులు

రాష్ట్రంలో తొలిదశ ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రంతో ముగిసింది.

- 8లో



ఈవీఎంలను తరలిస్తున్న బస్సు బోల్తా

ఒడిశాలోని గంజాం జిల్లా చికిటి నియోజకవర్గంలో ఈనెల 13వ తేదీన జరగనున్న ఎన్నికల కోసం ఈవీఎంలను తరలిస్తున్న బస్సు శనివారం బోల్తా కొట్టింది.

- 8లో

న్యూస్‌రీల్

తేనెటీగల దాడిలో ఒకరికి గాయాలు



గాయపడిన కుడుకక

రాయగడ: తేనెటీగల దాడిలో ఒకరు తీవ్రగాయాలకు గురయ్యారు. జిల్లాలోని గుడారి సమితి మధుబన్ పంచాయతీలోని బండిలి గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గాయాలు పాలైన వ్యక్తి పస్కెంటి కుడుకక (55)గా గుర్తించారు. శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి గాయలు తగిలిన వ్యక్తిని వెంటనే గుడారి ఆస్పత్రికి తరలించారు. రోజు కూలీగా పనిచేస్తున్న బాధితుడు పనులను ముగించుకుని, తిరిగి తన ఇంటికి వెళ్లేందుకు గ్రామానికి సమీపంలోని నదికి స్నానానికి వెళ్లాడు. ఈ నేపథ్యంలో అక్కడే ఒక చెట్టుపై ఉన్నటువంటి తేనెటీగలు ఒక్కసారిగా దాడిచేసి గాయపరిచాయి. సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడికి వెళ్లి తీవ్రగాయాలతో ఉన్న కుడుకకను చికిత్స కోసం తరలించారు.

తాత్కాలిక అధ్యక్షుడిగా మంగరాజ్



శంకర్షన్ మంగరాజ్

రాయగడ: జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) తాత్కాలిక అధ్యక్షుడిగా శంకర్షన్ మంగరాజ్ నియమితులయ్యారు. పీసీసీ ఉపాధ్యక్షుడు శివానంద ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మంగరాజ్ ఇప్పటివరకు డీసీసీ సాధారణ కార్యదర్శిగా బాధ్యతలను నిర్వహిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం డీసీసీ అధ్యక్షుడిగా వ్యవహరించే బిజయ్ కుమార్ గొమాంగో తన పదవికి రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో తాత్కాలిక అధ్యక్షుడిగా మంగరాజ్ నియమితులయ్యారు.

ఎన్నికల ప్రలోభాలు..?

- బీజేడీ నాయకుడి వీడియో వైరల్



ఓటర్లకు డబ్బులు పంచిపెడుతున్న దృశ్యం

రాయగడ: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఓటర్లను ప్రలోభపెట్టే వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. బీజేడీ రాష్ట్ర శాఖ సాధారణ కార్యదర్శి, ఆ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు సుదీర్ దాస్ ఓటర్లకు డబ్బులు పంచిపెడుతున్నట్లు బయటకు వచ్చిన వీడియో చర్చనీయాంశంగా మారింది. జిల్లాలోని బిసంకటక్ శాసనసభ నియోజకవర్గం నుంచి బీజేడీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరకకు ఓట్లు వేయాలని ఆ వీడియోలో అంటున్నారు. ఈ మేరకు ప్రతీ ఓటరుకు డబ్బులు పంచిపెడుతున్న వైనం వెలుగు చూసింది. నిబంధనలు తుంగలోతొక్కి నాయకులు ఓటర్లను ప్రలోభ పెడుతుండడం గమనార్హం. దీనిపై జిల్లా ఎన్నికల అధికారి ఎంతవరకు స్పందిస్తారో వేచిచూడాల్సిందేనని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

ఓటు వేసే అవకాశం కల్పించండి

- ఒడిశా డ్రైవర్ల మహా సంఘం డిమాండ్



మాట్లాడుతున్న డ్రైవర్ల మహాసంఘం కార్యదర్శి అచ్యుత్ కుమార్ పాత్రో

పర్లాకిమిడి: ఎన్నికల్లో మాకు ఓటు వేసే అవకాశం కల్పించండి మహాప్రభో అని జిల్లా కలెక్టర్ నివాసం వద్ద ఒడిశా డ్రైవర్ల మహా సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఎన్నికల వాహనాల తరలింపులో అధికారులు తలమునకలయ్యే సమయంలో కలెక్టర్ నివాసం వద్ద మోహనా, పర్లాకిమిడి నుంచి ఎన్నికల సిబ్బందికి తరలించే బస్సు, వాహనాల డ్రైవర్లు ఓటు వేసే అవకాశం ఏ సంవత్సరం కూడా మాకు రావడం లేదని మొరపెట్టుకున్నారు. సోమవారం ఎన్నికల పోలింగ్ బూత్‌లకు వాహనాలను శనివారం నుంచి తరలించారు. డ్రైవర్లకు పోస్టల్ బ్యాలట్ అయినా కల్పించాలని విన్నవించారు. ఈ ఆందోళనలో ఒడిశా డ్రైవర్ల మహాసంఘం అధ్యక్షుడు బిజయ కుమార్ బెహెర్ దోళాయి, కార్యదర్శి అచ్యుత్ కుమార్ పాత్రో ఇతర డ్రైవర్లు ఉన్నారు.

ఒడిశాలో కమలం వికసిస్తుంది

- ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి చూపిస్తాం
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ
- రాజధానిలో మోదీ రోడ్ షో



కిటకిటలాడిన జనపథ్ మార్గం

భువనేశ్వర్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఒడిశాలో కమలం వికసిస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. నగరంలోని జనపథ్ రోడ్డులో శుక్రవారం రాత్రి రోడ్ షో నిర్వహించారు. దీంతో ఆ ప్రాంతమంతా జై శ్రీరామ్ నినాదాలతో మారుమోగింది. ఘంటానాదం, ఉల్లాలు, పాయికా యుద్ధ విన్యాసాలు, ఒడిస్సీ, గొట్టి పువా, సంబలపురి నృత్యాలతో దారి పొడవునా సంప్రదాయ వాతావరణం నెలకొంది. భారీ సంఖ్యలో ప్రజలు బారికేడ్ల పరిమితిలో గుమిగూడారు.

ప్రత్యేక విమానంలో భువనేశ్వర్‌కు...


ప్రధాని నరేంద్రమోదీ శుక్రవారం రాత్రి ప్రత్యేక విమానంలో 8.30 గంటలకు స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి నేరుగా జనపథ్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి వచ్చారు. రాత్రి 8.41 గంటలకు మాస్టర్ క్యాంటిన్ మీదుగా బీజేపీ రాష్ట్ర కార్యాలయం ఆవరణకు విచ్చేశారు. కార్యాలయం ఎదుట భువనేశ్వర్ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల బీజేపీ అభ్యర్థులతో ముచ్చటించి రోడ్ షో కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రత్యేకంగా అలంకరించిన ప్రచార రథంలో ప్రజలకు అభివాదం చేశారు. బీజేపీ భువనేశ్వర్ లోక్‌సభ అభ్యర్థి అపరాజిత షడంగి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మన్మోహన్ సామల్ ఆయనతో ఉన్నారు. వాణీ విహార్ వీధి వరకు సుమారు ఒకటిన్నర కిలోమీటర్ల మేర రోడ్ షో నిర్వహించారు. ఈ బాటలో 12 చోట్ల ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికలపై సంప్రదాయ నృత్యాలు ప్రదర్శించారు. జనపథం అంతటా మోదీ భారీ కటౌట్‌లు, రాష్ట్రంలో ప్రఖ్యాత చారిత్రాత్మక కోణార్క్, ఖండగిరి, ఉదయగిరి మొదలైన నమూనాలు ఆకర్షణీయంగా అమర్చారు. వివిధ వేదికలపై కేంద్ర ప్రభుత్వ విజయాలను తెలియజేస్తూ బ్యానర్లు వెలిశాయి. దాదాపు 9.45 గంటలకు రోడ్ షో ముగిసింది.

రాజ్ భవన్‌లో బస

రోడ్ షో అనంతరం భారీ భద్రత మధ్య మోదీ రాజ్‌భవన్‌కు వెళ్లారు. రాత్రి అక్కడే బస చేశారు. శనివారం ఉదయం కందమల్, బొలంగీర్, మధ్యాహ్నం బరగడ్ ప్రాంతాల్లో మూడు విజయ సంకల్ప్ సమావేశాల్లో పాల్గొన్నారు. ఎన్నికల ప్రచారం కోసం ఒడిశాలో మోదీ పర్యటించడం వరుసగా ఇది రెండోసారి. భువనేశ్వర్‌లో మోదీ రోడ్ షో సందర్భంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి మాస్టర్ క్యాంటిన్ నుంచి వాణీ విహార్ వీధి వరకు రహదారిని మూసి వేశారు. రోడ్డుకు ఇరువైపులా బారికేడ్లు వేశారు. మోదీ కార్యక్రమానికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా కమిషనరేట్ పోలీసులు అన్ని ఏర్పాట్లు చేశారు.

రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తాం

ఈ సందర్భంగా ప్రధానమంత్రి మోదీ మాట్లాడుతూ.. ఒక్క అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తామన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య సంబంధాలు తెగిపోయాయని ఆరోపించారు. రాజుల కాలంలో కూడా పాలకులతో సంబంధాలు ఉండేవని, కానీ ఇక్కడ ప్రస్తుతం ప్రజలతో పాలకులకు సంబంధాలు లేవని ధ్వజమెత్తారు. రానున్న రోజుల్లో ఒడిశాలో పెద్ద మలుపు రాబోతోందన్నారు. బీజేపీ, బీజేడీ సంబంధాలపై అడిగిన ప్రశ్నకు ఆయన స్పందిస్తూ.. మేం రెండు వేరు వేరు పార్టీలుగా ఉన్నామన్నారు. పార్లమెంటులో సమస్యల ఆధారిత మద్దతు ఉంది. అసెంబ్లీలో వారిపై పోరాటం కొనసాగిస్తున్నామని తెలియజేశారు.



రామ మందిరం కూడలిలో ప్రజలకు అభివాదం చేస్తున్న పీఎం మోదీ



కమలం పువ్వు గుర్తును చూపిస్తున్న ప్రధానమంత్రి మోదీ

ఓట్ల ప్రామాణీకరణ తేదీ ప్రచురణకు ఏడీఆర్ అభ్యర్థన

భువనేశ్వర్: ఎన్నికల్లో పోలైన ఓట్ల ప్రకటనపై పారదర్శకత కోసం ప్రజాస్వామ్య సంస్కరణ సంఘం (ఏడీఆర్) నడుం బిగించింది. ఈ నేపథ్యంలో ఆ సంస్థ సుప్రీం కోర్టుని ఆశ్రయించింది. పోలింగ్ జరిగిన 48 గంటల్లోగా పోల్ అయిన ఓట్ల ప్రామాణీకరణ తేదీని ప్రచురణకు భారత ఎన్నికల సంఘాన్ని (ఈసీఐ) ఆదేశించాలని కోరుతూ సుప్రీం కోర్టులో పిటిషన్‌ను దాఖలు చేసింది. లోక్‌సభ ఎన్నికల ఓటరు టర్న్ అవుట్ సమగ్ర వివరాలను ప్రచురించడంలో ఈసీఐ విపరీతమైన జాప్యం, ప్రారంభ గణాంకాల నుంచి అసాధారణంగా అధిక సవరణలతో ముడిపడి పోతుందనే భయాందోళనలను ప్రేరేపిస్తుందని ఏడీఆర్ పేర్కొంది. ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో ప్రతి దశ పోలింగ్ ముగిసిన తర్వాత, అన్ని పోలింగ్ స్టేషన్ల ఫారమ్ 17సీ పార్ట్-1 (ఓట్ల నమోదు ఖాతా) స్కాన్ చేసిన స్పష్టమైన కాపీలను వెంటనే ఈసీఐ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసేందుకు ఆదేశించాలని ఏడీఆర్ సుప్రీం కోర్టుని అభ్యర్థించింది. ఈ మేరకు పోలింగ్ తర్వాత ఫారం 17సీ పార్ట్-1లో నమోదైనట్లుగా పోల్ అయిన ఓట్ల సంఖ్యకు సంబంధించిన పూర్తి గణాంకాలలో ట్యాబులేటెడ్ పోలింగ్ స్టేషన్ల వారీ డేటాను బహిరంగపరచాలని కోరింది. 2024 లోక్‌సభ ఎన్నికలలో నియోజకవర్గాల వారీగా సంపూర్ణ సంఖ్యలో ఓటర్ల సంఖ్య వివరాలు ప్రదర్శించేందుకు ఆదేశించాలని ఏడీఆర్ అభ్యర్థించింది.

కొందమాల్‌లో మావో పోస్టర్ల కలకలం



కూంబింగ్ నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్ జవాన్లు



దుకాణంపై అతికించిన పోస్టర్

బరంపురం: ప్రశాంతతకు మారుపేరైన కొందమాల్ జిల్లాలో మావోయిస్టుల పోస్టర్లు కలకలం రేపాయి. శనివారం ఉదయం కొందమాల్ జిల్లా కుర్మగడా ప్రాంతంలో ఒక దుకాణం, చెట్టుపై మావోయిస్టు పోస్టర్లు దర్శనమివ్వడంతో స్థానికులు భయాందోళనకు లోనయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పోస్టర్లను స్వాధీనం చేసుకున్నారు. మావోయిస్టుల పోస్టర్లతో ఒక్కసారిగా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. పోస్టర్లలో ఎన్నికలు బహిష్కరించాలని ఒడియా భాషలో రాసి ఉంది. దీంతో గంజాం, గజపతి, కొందమాల్, కలహండి జిల్లాల సరిహద్దుల్లో వచ్చిపోయే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు.

అంతా గోవింద నామస్మరణ



పూజల్లో భక్తజనం



ఛత్రపూర్ తిరువీధుల్లో ఊరేగుతున్న శ్రీవారు

- వైభవంగా వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

బరంపురం: ఛత్రపూర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయ 17వ వార్షికోత్సవ అష్టోత్తర శత సహస్ర నామార్చనా మహోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం ఆరు గంటల సమయంలో వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం శ్రీవారి ఉత్సవ దేవత విగ్రహాన్ని ప్రత్యేక రథంలో తిరువీధుల్లో ఊరేగించారు. శ్రీవారిని దర్శించుకోవడానికి భక్తులు భారీగా తరలివచ్చారు. సాయంత్రం జరిగిన భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.



ప్రసాద సేవనం చేస్తున్న ఛత్రపూర్ తెలుగు ప్రజలు

జగన్నాథుని యాత్రకు అంకురార్పణ



వేద పండితుల ఆధ్వర్యంలో రథ తయారీ శాలలో అంకురార్పణ హోమం



రథాల తయారీ పని ముట్లతో అంకురార్పణ పూజ


భువనేశ్వర్: జగన్నాథస్వామి వారి వార్షిక యాత్ర కోసం రథాల తయారీ ప్రారంభమైంది. అక్షయ తృతీయను పురస్కరించుకుని అంకురార్పణ పూజాదులు ముగియడంతో ఈ పనులు ఊపందుకుంటాయి. ప్రత్యేక హోమాదులతో అంకురార్పణ పూజలు నిర్వహించారు. మూలవిరాట్టు నుంచి ఆజ్ఞా మాల రథాల తయారీ శాల ప్రాంగణానికి చేరడంతో నిర్మాణం పనులకు శ్రీకారం చుట్టారు. ఇక నుంచి ఈ పనులు నిర్విరామంగా కొనసాగుతాయి. మహరణ వర్గం సేవాయత్‌ల ప్రత్యక్ష పర్యవేక్షణలో పలువర్గాల కార్మికులు రథాల తయారీ పనుల్లో పాలుపంచుకుంటారు.



రథాల ప్రధాన దుంగలకు ఆజ్ఞా మాలలతో పూజాదులు

తెలుగు ఓటరే కీలకం

- బరంపురం లోక్‌సభ స్థానంలో నిర్ణయాత్మక శక్తిగా తెలుగువారు
- ఆకట్టుకునేందుకు ప్రధాన పార్టీల అభ్యర్థుల ప్రయాసలు
- రేపే పోలింగ్



భువనేశ్వర్: రాష్ట్రంలో తెలుగువారి ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో గంజాం జిల్లాలోని బరంపురం ఒకటి. తరతరాలుగా పలు కుటుంబాలు ఈ ప్రాంతంలో స్థిరపడ్డారు. ఈ నేల నుంచి ఎందరో సాహితీవేత్తలు, వ్యాపారవేత్తలు, కళాకారులు ఉన్నత శిఖరాలను అధిరోహించారు. అలాగే ఎన్నికల్లో బరంపురం తెలుగు వారిని నిర్ణయాత్మక శక్తిగా అఖిల పక్షాలు పరిగణించడం విశేషం. బరంపురం లోక్‌సభ యావత్తు మనుగడ తెలుగు వారి ఓటుతో ముడిపడి ఉంటుంది. తొలి విడతలో బరంపురం లోక్‌సభ స్థానంలో పోలింగ్ జరగనుంది. ఈనెల 13న సోమవారం పోలింగులో పాల్గొనేందుకు ఓటరు వర్గం సమాయత్తం అవుతుంది.

కాంగ్రెస్ కంచుకోట

1971లో బరంపురం లోక్‌సభ స్థానం ఆవిర్భవించింది. 2009 వరకు కాంగ్రెస్‌కు కంచుకోటగా పరపతి కల్పించింది. ఆ పార్టీ అంతరంగిక వ్యవహారాలతో క్రమంగా డీలా పడడంతో బిజూ జనతా దళ్ పగ్గాలు చేపట్టింది. ఈసారి భారతీయ జనతా పార్టీ బరంపురం కైవసం చేసుకోవాలనే పట్టుదలతో తెలుగు ఓటరు మనసు దోచుకునేందుకు పావులు కదుపుతోంది. బీజేడీ అసంతృప్తివాదుల ఆధ్వర్యంలో తెలుగు ఓటు బ్యాంకుని సానుకూలంగా మలచుకునేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. బరంపురం లోక్‌సభ స్థానం వరుసగా గత రెండు దఫాలుగా బీజేడీ ఆధీనంలో ఉంది. ఈసారి 11 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఈసారి పాత ముఖాలు కొత్త పరిచయంతో ఈ నియోజకవర్గం నుంచి పోటీకి దిగారు. వీరిలో బీజేడీ అభ్యర్థి భృగు బక్షిపాత్రో, బీజేపీ అభ్యర్థిగా డాక్టర్ ప్రదీప్ కుమార్ పాణిగ్రాహి బరిలో ఉన్నారు.

రసవత్తర పోరు

ప్రధాన పోటీలో బీజేడీ, బీజేపీ ముఖాముఖి తలపడతాయి. అభ్యర్థి ఎంపికలో స్వల్ప లోపాలను సమయస్ఫూర్తితో మలచుకుని ధీటైన పోటీనిచ్చేందుకు బరిలో ఉన్న కాంగ్రెస్, స్వతంత్ర అభ్యర్థులు కసరత్తు చేస్తున్నారు. ఈ రెండు వర్గాల పక్షాన కొన్ని తెలుగు ఓట్లు అనుకూలించే అవకాశం లేకపోలేదు. బరంపురం పార్లమెంటరీ నియోజకవర్గంలో సమగ్రంగా ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో తెలుగువారి ప్రాబల్యం కొనసాగుతోంది. వీరిలో క్రైస్తవ, గిరిజన, మత్స్యకార ఓటర్ల పాత్ర కీలకమే. తెలుగు ఓటర్ల నాడి సరిచూసుకున్న అభ్యర్థి ఎంపీ కావడం తథ్యమనే నమ్మకం రాష్ట్ర స్థాయిలో ప్రతిబింబిస్తుంది.

సమైక్య నిర్ణయం కీలకం



భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో బరంపురం పార్లమెంటరీ నియోజకవర్గం రాష్ట్రస్థాయిలో విభిన్నత చాటుకుంటుంది. ఈ నియోజకవర్గం పరిధిలో చికిటి, గోపాలపూర్, బరంపురం, ఛత్రపురం, పర్లాకిమిడి స్థానాల్లో తెలుగు వారి ప్రాబల్యం అధికం. బరంపురం పార్లమెంటరీ నియోజకవర్గంలో సమగ్రంగా 42 శాతం వరకు తెలుగు ఓటరు బలం ఉంది. సమైక్య నిర్ణయంతో తెలుగు వారు నిష్పక్షపాతంగా ఓటు వేసేందుకు నిర్భయంగా ముందుకు వస్తే రాష్ట్ర, జాతీయ రాజకీయాల్లో మనం మనం బరంపురం సత్తా దేదీప్యంగా వర్ధిల్లుతుంది.

– పూడిపెద్ది సత్యనారాయణ

అవగాహనతో అడుగు వేయిస్తా



ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరు, ఓటు అత్యంత కీలకం. ఓటుహక్కుపై సామాన్య ఓటరుకి సైతం అవగాహన కలిస్తే సమ మనోభావాలు కలిగిన ఓటరు వర్గం అంతా ఒక్కతాటిపైకి వచ్చి కావాల్సిన అభ్యర్థిని బరంపురం నుంచి భారత పార్లమెంట్‌కు పంపగలుగుతుంది. ఈ దృక్పథంతో సగటు ఓటరుని చైతన్య పరిచేందుకు సాంఘిక మాధ్యమంలో పలు అవగాహన, చైతన్య, సందేశాత్మక ప్రసారాలు చేస్తున్నాం. ఓటు వేయడంపై చైతన్య పరిచేందుకు నా వంతు ప్రయత్నం చేస్తున్నాను.

– మోనింగి కామేశ్వరి

నిర్ణయాత్మకంగా ఓటు వేయాలి



సార్వత్రిక ఎన్నికల్లో నిర్ణయాత్మక ఓటు వేయాల్సిన పరిస్థితులు పొంచి ఉన్నాయి. ఆచితూచి అత్యంత శక్తివంతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి. బరంపురం స్థానిక సంస్థల ఎన్నికల్లో స్థానికుల నిర్ణయం మేరకు అభ్యర్థులు పోటీకి దిగే సర్వోన్నత సంప్రదాయం క్రమంగా పూర్వ వైభవాన్ని సంతరించుకోవాల్సి ఉంది. ఓటరు నిర్ణయంతో అభ్యర్థిని ఖరారు చేసుకోగలిగే స్థాయికి చేరుకునేందుకు సమైక్యంగా ప్రాబల్యం ఉన్న ఓటరు వర్గం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బరంపురం ప్రత్యేకతకు పట్టంగట్టాలి.

– వి.వి.రామనరసింగరావు

మరో అవకాశం ఇవ్వండి



మార్కెట్ జంక్షన్ వద్ద బీజేపీ నాయకుడు కోడూరు నారాయణరావు

పర్లాకిమిడి: పర్లాకిమిడి అసెంబ్లీ సెగ్మెంట్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోడూరు నారాయణరావుకు మద్దతుగా ఒకటో నంబర్ వార్డు రాంనగర్ నుంచి బైక్ ర్యాలీ శనివారం నిర్వహించారు. వందలాది అభిమానులు బైక్ ర్యాలీలో పాల్గొని 16 వార్డుల్లో పర్యటించారు. ఆయన వెంట ఛత్రి సింహాద్రి, ఇండిపెండెంట్ అభ్యర్థి ప్రీతిలతా పట్నాయక్, మహిళా మోర్చా నాయకురాలు మామిడి రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు. ఈసారి కేంద్ర, రాష్ట్ర బీజేపీ నాయకులు, స్టార్ క్యాంపెయిన్‌లు లేకుండానే ర్యాలీలను ఎమ్మెల్యే అభ్యర్థి కోడూరు నారాయణరావు జరిపించారు. కె.ఎస్.ఆర్ ఒన్స్ ఎగేయిన్ అన్న నినాదంతో ఈ ఎన్నికల్లో ప్రజల్లోకి వెళ్తున్నారు.

స్వగ్రామాలకు వలస కార్మికులు



బరంపురం రైల్వే స్టేషన్‌కు వస్తున్న వలస కార్మికులు

- రద్దీగా బరంపురం రైల్వేస్టేషన్
- వలస ఓటర్లపై రాజకీయ పార్టీలు దృష్టి

బరంపురం:

రాష్ట్రంలో తొలి విడత పోలింగ్‌కు సమయం ఆసన్నమైంది. ఈ నెల 13వ తేదీన గంజాం జిల్లాలో ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవడానికి వలస కార్మికులు స్వగ్రామాలకు చేరుతున్నారు. ఈ జిల్లాకు చెందిన వేలాది మంది సూరత్, అహ్మదాబాద్, వర్ధ వంటి నగరాల్లో వివిధ పనులు చేసుకుంటున్నారు. వీరంతా ఓటు వేసేందుకు శుక్ర, శనివారాల్లో స్వగ్రామాలకు చేరుకోవడానికి బరంపురం రైల్వే స్టేషన్‌లో దిగుతున్నారు. వీరిరాకతో రైల్వేస్టేషన్ రద్దీగా మారింది. అక్కడ నుంచి తమ గ్రామాలకు వాహనాల్లో వెళ్తున్నారు. రాజకీయ పార్టీల నాయకులు సైతం వలస ఓటర్లపై దృష్టిసారించారు. తమవైపు తిప్పుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.



సూరత్ నుంచి బరంపురం రైల్వే స్టేషన్‌కి వచ్చిన వలస కార్మికులు



బరంపురం రైల్వే స్టేషన్ నుంచి వాహనాల్లో స్వగ్రామాలకు వెళ్తున్న వలస కార్మికులు

క్లుప్తంగా

భారీగా మద్యం బాటిళ్ల పట్టివేత


పట్టుబడిన మద్యంతో వ్యాన్ డ్రైవర్

పర్లాకిమిడి: ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల్లో సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న సమయంలో శుక్రవారం రాత్రి పర్లాకిమిడి – పాతపట్నం రోడ్డులోని మెడికల్ జంక్షన్ వద్ద వ్యాన్‌ను పెట్రోలింగ్ పోలీసులు అడ్డుకుని తనిఖీలు చేపట్టారు. రూ.లక్షలు విలువ చేసే విదేశీ మద్యం పర్లాకిమిడి నుంచి అక్రమంగా తరలిస్తున్నట్టు గుర్తించారు. పట్టుబడిన ట్రక్కులో మొత్తం 118 కార్టన్స్ విదేశీ మద్యం, 47 పెట్టెలు ఆఫీసర్స్ ఛాయిస్ విస్కీ, 49 కార్టన్స్ మెక్‌డావల్ విస్కీ పెట్టెలు, 3 పెట్టెలు ఫ్రంట్‌లైన్ విస్కీ ఉన్నట్టు పోలీసు ఐఐసీ ప్రశాంత్ భూపతి తెలియజేశారు. ఈ మద్యం పర్లాకిమిడి గ్రీన్‌పార్క్ ఆఫ్‌లైన్ షాపు నుంచి సారవకోట మీదుగా శ్రీకాకుళం జిల్లాకు తరలిసున్నట్టు సమాచారం. పట్టుబడిన ట్రక్కు డ్రైవర్ బోడవలస శంకరరావు సారవకోట మండలం రైవాడ గ్రామవాసి. ట్రక్కు రవాణాకు సంబంధించి ఎటువంటి పర్మిట్, లైసెన్స్ లేనట్టు ఆదర్శ పోలీసు స్టేషన్ ఐఐసీ ప్రశాంత్ భూపతి తెలియజేశారు. ట్రక్కులో ఉన్న విదేశీ మద్యాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి డ్రైవరును అరెస్టు చేశారు. కేసును పర్లాకిమిడి ఐఐసీ భూపతి దర్యాప్తు చేస్తున్నారు.

అవినీతి అధికారులపై చర్యలు తీసుకుంటాం

- ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గౌరీచరణ్ దేవ్ శర్మ


మాట్లాడుతున్న ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గౌరీచరణ్ దేవ్ శర్మ

జయపురం: తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే అవినీతిపరులైన అధికారులపై కఠిన చర్యలు చేపట్టేందుకు పోరాటం చేస్తానని జయపురం నియోజకవర్గం ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థి గౌరీచరణ్ దేవ్ శర్మ తెలిపారు. శనివారం పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. కొంతమంది అధికారులు చేస్తున్న తప్పులను తాను ప్రజల ముందుకు తీసుకువస్తానన్నారు. జయపురంలో పలు అవినీతి, అక్రమాల పనులు జరుగుతున్నాయని ఆరోపించారు. జగన్నాథ్ సాగర్ పునర్‌నిర్మాణ పనుల్లో అవినీతి జరుగుతుందన్నారు. ఫేబర్ బ్లాక్‌లో జరుగుతున్న దుర్నీతి, పార్కుల నిర్మాణంలోనూ అలా ప్రతి పనులోనూ అవినీతి చోటు చేసుకుంటుందని ఆరోపించారు. ఆమ్ ఆద్మీ పార్టీ అధికారంలోకి వస్తే ఉచిత విద్యుత్, రక్షిత తాగునీరు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల స్థాపన, పర్యాటక స్థలాల అభివృద్ధి, నిరుద్యోగ సమస్య పరిష్కారం, వైద్య, విద్యా సౌకర్యాలు, మౌలిక సౌకర్యాలు సమకూర్చుతామని వెల్లడించారు.

ఈవీఎంలను తరలిస్తున్న బస్సు బోల్తా

- నోడల్ అధికారులకు గాయాలు


బోల్తా పడిన బస్సు

బరంపురం: ఒడిశాలోని గంజాం జిల్లా చికిటి నియోజకవర్గంలో ఈ నెల 13వ తేదీన జరగనున్న ఎన్నికల కోసం ఈవీఎంలను తరలిస్తున్న బస్సు శనివారం బోల్తా కొట్టింది. ఇందులో ఉన్న పదిమంది నోడల్ అధికారులు గాయాలతో బయపడ్డారు. సమాచారం అందుకున్న కె.నువాగాం పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది. సంఘటన స్థలానికి చేరుకున్నారు. వివరాల్లోకి వెళితే.. శనివారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఛత్రపూర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి చికిటి నియోజకవర్గానికి ఈవీఎంలను వాహనంలో తీసుకొస్తున్నారు. పితతొలి గ్రామం దగ్గర వాహనం అదుపుతప్పి పక్కన ఉన్న గోతిలో బోల్తాకొట్టింది. పదిమంది అధికారులు అందులో చిక్కుకుపోవడంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వారిని రక్షించారు. గాయపడిన వారిని చికిటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. బస్సు బోల్తాతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. బోల్తాపడిన బస్సును తొలగించేందుకు మూడు గంటల సమయం పట్టింది.


బోల్తా పడిన బస్సు నుంచి ఈవీఎం మిషన్లను బయటకు తీస్తున్న దృశ్యం

మూగబోయిన మైకులు

- తొలి దశ ఎన్నికల ప్రచారానికి తెర
- సీఈవో నికుంజ బిహారి ధొలొ వెల్లడి


స్వీప్ కార్యక్రమాల ఫోటోలు, వీడియోల ప్రదర్శన

భువనేశ్వర్: రాష్ట్రంలో తొలిదశ ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రంతో ముగిసింది. ప్రచారం ముగిసే చివరి ఘడియల్లో వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఓటర్లను ఆకట్టుకునేందుకు నిర్విరామంగా ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటింటికీ ప్రచారం, ఊరేగింపులు, రోడ్ షోలు, సమావేశాలు నిర్వహిస్తూ బిజీబిజీగా గడిపారు. గత కొద్ది రోజులుగా మే 13న ఓటింగ్ జరగనున్న ఒడిశా నియోజకవర్గాల్లో ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర మంత్రులు, ఇతర సీనియర్ జాతీయ స్థాయి నేతలు, బిజూ జనతా దళ్ అధ్యక్షుడు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ మరియు 5టీ చైర్మన్ వి.కె.పాండియన్ విస్తృతంగా ప్రచారం చేశారు. తొలి దశలో కలహండి, కొరాపుట్, నవరంగ్‌పూర్, బరంపురం లోక్‌సభ స్థానాలతో పాటు వాటి పరిధిలోని 28 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరగనుంది. మే 13న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది.

మహిళలే అధికం

రాష్ట్రంలో జరగనున్న తొలి దశ పోలింగులో మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సీఈవో నికుంజ బిహారి ధొలొ తెలిపారు. తొలి దశ పోలింగు పురస్కరించుకుని ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఆయనతో పాటు ఈ సమావేశంలో పాల్గొన్న అదనపు సీఈవో డాక్టర్ ఎస్.తిరుమల నాయక్, శతృఘ్న కొరొ, మిహిర్ ప్రసాద్ మహంతి, ప్రమోద్ కుమార్ సాహూ పోలింగ్ ఏర్పాట్లు, సంసిద్ధతపై చర్చించారు. ఓటరు అవగాహన కోసం స్వీప్ కార్యక్రమాల ఫోటోలు, వీడియోలను కూడా ప్రదర్శించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా ఒక సహకార ప్రయత్నంతో కృషి చేస్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలో తొలి దశలో పోలింగ్ జరగనున్న నాలుగు పార్లమెంట్ నియోజక వర్గాల్లోని ఓటర్ల జాబితా ప్రకారం పురుషుల కంటే మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారని ఒడిశా ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) నికుంజ బిహారి ధొలొ శనివారం తెలిపారు. లోక్‌సభ మరియు అసెంబ్లీకి ఏకకాల ఎన్నికల్లో మొదటి దశ పోలింగ్‌కు అన్ని వర్గాల ఓటర్లతో జాబితా సిద్ధమైందన్నారు. దివ్యాంగులు, వృద్ధులకు ఇంటింటికీ ఓటు వేసే వెసులుబాటు కల్పించామని తెలిపారు. ఎన్నికల విధుల్లో ఉన్న 23,000 మందికి పైగా ఓటర్లు ఈ సౌకర్య కేంద్రాల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. డిఫెన్స్, సర్వీసెస్ సిబ్బంది వారి ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా ఎల్రక్ట్రానిక్ పద్ధతిలో ఇప్పటికే 6,296 పోస్టల్ బ్యాలెట్లను పంపినట్లు పేర్కొన్నారు.


మాట్లాడుతున్న సీఈవో నికుంజ బిహారి ధొలొ

పటిష్టంగా భద్రతా ఏర్పాట్లు

ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం భద్రతా ఏర్పాట్లను పటిష్టం చేసింది. పోలింగ్ సమయంలో ఓటర్లు, పోలింగ్ అధికారులు మరియు పోలీసు సిబ్బంది భద్రత భారత ఎన్నికల సంఘం యొక్క ప్రాధాన్యత అంశాల్లో ఒకటని సీఈవో పేర్కొన్నారు. ఓటింగ్ సమయంలో శాంతి భద్రతలను పరిరక్షించేందుకు 104 కంపెనీల కేంద్ర సాయుధ పోలీసు బలగాలను మోహరించారు. ఈ నేపథ్యంలో పోలింగు ప్రశాంతంగా, సజావుగా జరుగుతుందన్న నమ్మకం మాకు ఉందన్నారు. ఓటర్లకు సంతోషకరమైన అనుభూతిని అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. నాలుగు పార్లమెంట్ నియోజకవర్గాల ఓటర్లందరూ మే 13న పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బీజేడీ పాలనలో రాష్ట్రం అధోగతి


మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి బాహిణీపతి

- జయపురం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి తారాప్రసాద్ బాహిణీపతి

జయపురం: రాష్ట్రంలో 24 ఏళ్ల బీజేడీ అధినేత నవీన పట్నాయక్ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని జయపురం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి తారాప్రసాద్ బాహిణీపతి ఆరోపించారు. బొరిగుమ్మ సమితి కుములి గ్రామం సంతతోటలో కాంగ్రెస్ పార్టీ శనివారం నిర్వహించిన విశాల మహిళా సమారోహంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామంలోని జగన్నాథ మందిరంలో పూజలు చేసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ రాష్ట్రంలో అభివృద్ధి కాంగ్రెస్ హయాంలోనే జరిగిందని వివరించారు. గత 24 ఏళ్ల బీజేడీ పాలనలో రాష్ట్రంలో అవినీతి, అశాంతి, అక్రమాలు పెరిగాయన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం నెలకొల్పిన పరిశ్రమలు, ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ, అంబానీ లాంటి పారిశ్రామిక వేత్తలకు విక్రయిస్తుందన్నారు. అనేక పరిశ్రమలు మూతపడటం వల్ల ఉద్యోగులు రోడ్డున పడి నిరుద్యోగ సమస్య తీవ్రరూపం దాల్చిందని విమర్శించారు. ఈ నియోజకవర్గంలో ఒక బీజేడీ నేత తన 15 ఏళ్ల ఎమ్మెల్యే కాలంలో శాంతిభద్రతలు క్షీణించాయని, గూండాయిజం పెరిగిందన్నారు. గత పదేళ్ల నుంచి నియోజకవర్గ ప్రజలు ఎంత హాయిగా ఉన్నారో తాను చెప్పనక్కరలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వృద్ధులకు రూ.2 వేల పెన్షన్ చెల్లించటం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన 9 హామీలను అమలు చేస్తుందని వివరించారు. హస్తం గుర్తుపై ఓటువేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వివిధ పార్టీలకు చెందిన పవిత్ర భూమియ, పితాంబర భూమియ, చైతన్య భూమియ, డొంబురుదొర భూమియ, నంద భూమియ, పితాంబర భూమియ, భగవాన్ జాని, త్రినాథ్ భూమియ, బిభీషన్ మాలి, మహేశ్వర నాయిక్, రామధర గౌడ, సోను చలాన్, అర్జున్ జాని, సదా ముదులి, దీను చలాన్ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి ఆశయాలకు ఆకర్షితులమై ఆయన వెంట నడిచేందుకు తామంతా కాంగ్రెస్‌లో చేరామని తెలిపారు.


ర్యాలీలో బాహిణీపతితో కాంగ్రెస్ శ్రేణులు


సమావేశంలో పాల్గొన్న మహిళలు

రాజీయే రాజమార్గం


రాయగడ: కేసులను విచారిస్తున్న జిల్లా జడ్జి షడంగి

రాయగడ: స్థానిక సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 5,519 కేసులను పరిష్కరించి, రూ.70,79,325 జరిమానాను వసూలు చేశారు. జిల్లా జడ్జి సత్యనారాయణ షడంగి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళా కోర్టు జడ్జి సొనాలి శర్మ, రిజిస్ట్రార్ సౌమ్యరూప్ సాహు, రాయగడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పద్మనాభ బెహర తదితరులు పాల్గొన్నారు. జల్లాలోని రాయగడ, గుణుపూర్, పద్మపూర్, కాసీపూర్, మునిగుడ కోర్టుల్లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కారం జరిగాయి. ఇందులో భాగంగా 5319 రెవెన్యూ కేసులను పరిష్కరించి రూ.3,25,225 వసూలు చేశారు. ఏడు లేబర్ కేసులను విచారించిన రూ.35,27,515 జరిమానా కింద వసూలు చేశారు. మరో 7 ప్రీలిటిగేషన్ కేసులను పరిష్కరించి రూ.1,81,000 అపరాధ రుసుం వసూలు చేశారు. జిల్లాలోని వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న మరో 186 కేసుల పరిష్కరించి రూ.34,45,585 జరిమానా కింద వసూలు చేశారు.

1,558 కేసులు పరిష్కారం

పర్లాకిమిడి: జిల్లా కోర్టులో ద్వితీయ రాష్ట్రీయ లోక్ అదాలత్‌ను జిల్లా జడ్జి, న్యాయసేవా ప్రాధికరణ అధ్యక్షుడు ప్రణబ్ కుమార్ రౌత్రాయ్ శనివారం ప్రారంభించారు. లోక్ ఆదాలత్‌లో మొత్తం 2,094 కేసులకు గాను 1,558 కేసులను వివిధ కోర్టుల్లో పరిష్కరించారు. రూ.13,27,811 అపరాధ రుసుం వసూలు చేశారు. లోక్ అదాలత్‌లో వివిధ ప్రభుత్వ బ్యాంకుల నుంచి రుణాలు ఎగవేతదారులకు సంబంధించి 390 కేసులకు గాను 30 కేసులు పరిష్కరించి రూ.6,77,850 జరిమానా రూపంలో ఆదాయం సమకూర్చారు. లోక్ అదాలత్‌లో ఫ్యామిలీ కోర్టు జడ్జి సుబ్రత్ మహంతి, సబ్‌జడ్జి పుణ్యశ్లోక్ రథ్, న్యాయ సేవా ప్రాధికరణ కార్యదర్శి రబినారాయణ బెహెరా, సబ్‌డివిజనల్ విచారణ జడ్జి విష్ణుప్రియా సామంతరాయ్, ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ సుభాషిష్ పాణి, బార్ అసోసియేషన్ సభ్యులు, ప్యానల్ లాయర్లు, పోలీసు విభాగం అధికారులు పాల్గొన్నారు.


పర్లాకిమిడి: కేసులను విచారిస్తున్న జిల్లా జడ్జి ప్రణబ్ కుమార్ రౌత్రాయ్


పర్లాకిమిడి: ఫ్యామిలీ కోర్టులో కేసులను వింటున్న సుబ్రత్ మహంతి

జయపురంలో..

జయపురం: జాతీయ, రాష్ట్ర న్యాయ సేవా ప్రదీకణ ఆదేశాల మేరకు స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం 3వ రాష్ట్ర స్థాయి లోక్ అదాలత్ నిర్వహించారు. కొరాపుట్ జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ అధ్యక్షుడు, జిల్లా జడ్జి సత్యనారాయణ మిశ్ర పర్యవేక్షణలో జిల్లా న్యాయ ప్రదీకరణ ఆధ్వర్యంలో జరిగిన లోక్ అదాలత్‌లో 4208 కేసులు పరిష్కరించారు. ఈ కేసుల ద్వారా రూ.1,72,34,546 జరిమానాగా వసూలు చేసినట్లు వెల్లడించారు. కొరాపుట్ జిల్లాలో కొరాపుట్, కొట్‌పాడ్, లక్ష్మీపూర్, సెమిలిగుడ, బొయిపరిగుడ, సెమిలిగుడ, లమతాపుట్ తదితర కోర్టుల్లో లోక్ అదాలత్‌లు నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు. 16 మోటారు ప్రమాదాల కేసులు పరిష్కరించి బాధితులకు రూ.88.48 లక్షలు పరిహారంగా వసూలు చేశారు. 9 వైవాహిక, కుటుంబ వివాదాలను పరిష్కరించారు. భూమి వివాదాలు, బ్యాంక్ రుణాలు, తదితర కేసులు పరిష్కరించారు. కేసులు పరిష్కరించిన వారిలో ఫ్యామిలీ కోర్టు విచారణపతి ధనేశ్వర మల్లిక్, అదనపు జిల్లా జడ్జి బిధ్యాధర పుస్టి, సీనియర్ జడ్జి రేఖారాణి పండా, మహిళా కోర్టు జడ్జి అంజలి మాచ్‌ఖండ్, లోక్ అదాలత్ శాశ్వత విచారణపతి సుమన్ జెన, రిజిస్ట్రార్ విష్ణుప్రసాద్ దేవత, జయపురం సబ్‌కలక్టర్, వివిధ విభాగాల జడ్జిలు పాల్గొన్నారు. లోక్ అదాలత్‌లో వైవాహిక వివాద కేసును పరిష్కరించి ఒక జంటను కలిపారు.

శ్రీక్షేత్రంలో చందన యాత్ర


చందన యాత్రతో కిటకిటలాడిన బొడొదండొ బాట

భువనేశ్వర్: చందన యాత్రతో శ్రీక్షేత్రం కిటకిటలాడుతోంది. అక్షయ తృతీయ పురస్కరించుకుని తొలి దశ 21 రోజుల బాహ్య చందన యాత్ర అంగరంగ వైభవంగా ఆరంభమైంది. ఈ సందర్భంగా స్వామివారు నిత్యం సంధ్యవేళలో బొడొ దండొ గుండా నరేంద్ర సరోవరం తీరానికి పల్లకిలో వేంచేసి నావికా విహారం చేయడం వినోదదాయకం. ఈ ముచ్చట ప్రత్యక్షంగా వీక్షించేందుకు పలు ప్రాంతాల నుంచి భక్తులు, యాత్రికులు పెద్ద సంఖ్యలో తరలి వస్తారు. నరేంద్ర సరోవరం తీరం సందర్శకులతో కళకళలాడుతుంది.


నరేంద్ర సరోవరానికి తరలి వెళ్తున్న స్వామివారు

భారీగా గంజాయి స్వాధీనం


పట్టుకున్న గంజాయితో నిందితులు

జయపురం: గంజాయి సాగు జోరుగా సాగుతుందని అనుమానిస్తున్న బొయిపరిగుడ సమితిలో శనివారం ఎక్సైజ్ సిబ్బంది వివిధ ప్రాంతాలో దాడులు జరిపి పెద్ద ఎత్తున గంజాయి పట్టుకున్నట్టు సమాచారం. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సారా ప్రవాహాన్ని అరికట్టాలని ఎక్సైజ్ కమిషనర్ నర్సింహ భోల్ ఆదేశం మేరకు జిల్లా ఎక్సైజ్ ఎస్పీ అరూప్ కుమార్ పాడీ దాడులు ముమ్మరం చేయాలని జిల్లాలో ఎక్సైజ్ విభాగాల అధికారులను ఆదేశించారు. నందపూర్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ అన్నపూర్ణ రథ్, జయపురం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శశికాంత దత్, కొరాపుట్ ఎస్సైజ్ అధికారి చంద్ర శేఖర పాడియారి, బొయిపరిగుడ ఎస్సైజ్ అదికారి భగవాన్ మహానందియల నేతృత్వంలో సిబ్బంది బొయిపరిగుడ సమితిలోని పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించి గంజాయిని పట్టుకున్నట్లు బొయిపరిగుడ ఎక్సైజ్ అధికారి వెల్లడించారు. బొయిపరిగుడ ఎక్సైజ్ పరిధి మఝిగుడ గ్రామ పంచాయతీ దానరంగిణీగుడలో రెండు చోట్ల గంజాయి పట్టుకున్నామన్నారు. గ్రామంలోని ఓ మహిళ నుంచి 60 కేజీలు, మరో మహిళ వద్ద 32 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బొయిపరిగుడ సమితి హోల్డికుండ్ గ్రామంలో దాడి నిర్వహించి ఓ వ్యక్తి వద్ద 42 కేజీల గంజాయి పట్టుకున్నట్లు తెలిపారు. ముగ్గురిపై కేసులు నమోదు చేసి కోర్టుకు పంపామన్నారు.

జయపురంలో బైక్ ర్యాలీ


జయపురంలో నిర్వహించిన బైక్ ర్యాలీలో కాంగ్రెస్ శ్రేణులు

జయపురం: పట్టణంలో కాంగ్రెస్ పార్టీ వేలాది మంది కార్యకర్తలతో బైక్ ర్యాలీ నిర్వహించి శక్తి ప్రదర్శన జరిపింది. శనివారం సాయంత్రం పట్టణంలోని ప్రధాన మార్గాల్లోనూ, పలు వీధుల్లోనూ ర్యాలీ నిర్వహించారు. నిన్నటివరకు పార్టీకి దూరంగా ఉన్న మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దుర్గాప్రసాద్ శర్మ లాంటి సీనియర్ కాంగ్రెస్ నాయకులు ర్యాలీలో పాల్గొన్నారు. ప్రతీ కూడలి వద్ద ప్రజలను ఉద్దేశించి కాంగ్రెస్ అభ్యర్థి తారా ప్రసాద్ బాహిణీపతి ప్రసంగించారు. గత పదేళ్లుగా తాను ప్రజలకు అందించిన సేవలను, పట్టణ అభివృద్ధిని వివరించారు. కాంగ్రెస్ పార్టీ 9 హామీలను వివరించారు. జయపురం మున్సిపల్ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి, మాజీ వైస్ చైర్మన్ దుర్గా ప్రసాద్ శర్మ, జిల్లా మీడియా సెల్ చీఫ్ సుకాంత పట్నాయక్, నిహార బిశాయి తదితరులు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న బాహిణీపతి

తొలిదశ పోలింగ్‌కు సన్నద్ధం

బరంపురం: రాష్ట్రంలో తొలిదశ పోలింగ్ నిర్వహణకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఈ నెల 13వ తేదీన రాష్ట్రంలో అతి పెద్ద జిల్లాగా పేరుపొందిన, స్వయాన రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రాతినిధ్యం వహిస్తున్న గంజాం జిల్లాలో తొలిదశ ఎన్నికలు జరగనున్నాయి. లోకసభతోపాటు విధానసభ స్థానాలకు ఎన్నికలు సజావుగా నిర్వహించేలా పాలన యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. బరంపురం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో డిప్యూటీ కలెక్టర్ వినోద్ కుమార్ బెహరా ఆధ్వర్యంలో బరంపురం లోక్‌సభ, ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల కోసం 1126 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్‌కు కావాల్సిన సామగ్రిని సమాగ్రీలు ఇప్పటికే సిద్ధంగా ఉంచామని నోడల్ అధికారి శనివారం తెలిపారు. సన్నోఖేముండి అసెంబ్లీ నియోజకవర్గంలో 253, గోపాల్‌పూర్‌లో 208, బరంపురంలో 169, దిగపండిలో 255, చికిటి నియోజకవర్గంలో 141 పోలింగ్ కేంద్రాలను కేటాయించామన్నారు. ఈవీఎం, బ్యాలెట్ యూనిట్, ఓట్ల జాబితా రికార్డు, ఓటు స్లిప్‌లు, బుక్ లెట్ లెటర్స్, స్టాంప్ ప్యాడ్‌లు, ఇంక్ బాటిళ్లతోపాటు 140 సామగ్రిలను సిద్ధం చేసినట్లు డిప్యూటీ కలెక్టర్ వినోద్‌కుమార్ బెహరా తెలిపారు.

రాయగడ జిల్లాలో..

రాయగడ: ఈ నెల 13వ తేదీన తొలివిడతగా జరగనున్న పోలింగ్ శాంతియుతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం తగు చర్యలు చేపట్టింది. జిల్లాలోని రాయగడ, గుణుపూర్, బిసంకటక్ శాసనసభ నియోజకవర్గాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు 884 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా రాయగడ శాసనసభ నియోజకవర్గంలో 301, బిసంకటక్‌లో 293, గుణుపూర్‌లో 290 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా యంత్రాంగం ప్రకటించింది. ఇదిలాఉండగా ఈ సార్వత్రిక ఎన్నికలు సక్రమంగా నిర్వహించే విధంగా యంత్రాంగం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా 5,304 ప్రాసిడంగ్ అధికారులను నియమించారు. ప్రతీ బూత్‌లో శాంతియుత వాతావరణంలో ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈసారి ఎన్నికల్లో ఆదర్శ బూత్‌లలో భాగంగా 88 సఖీ పోలింగ్ కేంద్రాలను, మరో 15 యువత కోసం, మరో మూడు దివ్యాంగుల కోసం మరో మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. కాగా రాయగడ, బిసంకటక్, గుణుపూర్ శాసనసభ నియోజకవర్గాల్లో మొత్తం 6,13,153 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో పురుషులు 3,35,977 మంది, మహిళలు 3,76,988 మంది, ఇతరులు 188 మంది ఉన్నట్లు అధికారులు వివరించారు. కాగా ఎన్నికల నిర్వహణలో భాగంగా స్థానిక గొవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో ఎన్నికల సన్నాహాలకు సంబంధించి ఏర్పాట్లు కొనసాగిస్తున్నారు. 903 వాహనాలను సిబ్బందితోపాటు ఎన్నికల సామగ్రిని తరలించేందుకు అధికారులు సిద్ధం చేశారు.


ఎన్నికల సామగ్రిని సిద్ధం చేస్తున్న అధికారులు


ఇనుప బాక్సుల్లో సామగ్రిని సర్దుతున్న పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ వినోద్ కుమార్ బెహరా


పోలింగ్ కేంద్రాలకు సిద్ధం చేసిన ఇనుప బాక్సులు


జీసీడీ మైదానంలో ఏర్పాట్లలో అధికారులు


ఈవీఎంలను తరలిస్తున్న సిబ్బంది


సిద్ధం చేసిన వాహనాలు

క్లుప్తంగా

ర్యాండమైజేషన్ ద్వారా సిబ్బంది కేటాయింపు



ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బందిని కేటాయించారు. జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు హనీష్ చాబ్రా, తలాత్ పర్వేజ్ ఇక్బాల్ రోహెల్లా, సీతారామ్ జాట్ సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి స్థానిక కలెక్టరేట్ ఎన్ఐసీలో శనివారం ఈ ప్రక్రియ నిర్వహించారు. అన్ని నియోజకవర్గాలలో ఉన్న పోలింగ్ కేంద్రాలకు పీఓలు, ఏపీఓలు, ఓపీఓలను కేటాయించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, ఈవీఎం నోడల్ అధికారి బి.ఉమాశంకర్, ఎన్ఐసీ డీఐఓ నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

వరంగల్‌లో లక్ష్మీపురం వాసి మృతి



ముసలినాయుడు (ఫైల్)

సీతానగరం: మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన గవర ముసలినాయుడు(సాయి)24 తెలంగాణలోని వరంగల్ బస్‌స్టేషన్ వద్ద టిప్పర్ ఢీ కొనడంతో జరిగిన ప్రమాదంలో దుర్మరణం చెందాడు. మృతుడి సన్నిహితులు లక్ష్మీపురంలో ఉన్న కుటుంబసభ్యులకు ఫోన్ ద్వారా ఈ సమాచారం అందించారు. ఈ ఘటనపై మృతుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ముసలినాయుడు జీవనోపాధి నిమిత్తం తెలంగాణ రాష్ట్రంలోని రామగుండంలో గల ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తూ కుటుంబానికి పెద్దదిక్కుగా నిలిచాడు. రాష్ట్రంలో సోమవారం జరగనున్న ఎన్నికల్లో ఓటు వేయడానికి ఊరు వచ్చేందుకు బయల్దేరిన ముసలినాయుడు సన్నిహితులతో కలిసి వరంగల్ బస్‌స్టేషన్‌కు వచ్చాడు. తిరిగి సన్నిహితులంతా కంపెనీకి వెళ్లడానికి అందరూ రోడ్డుపై ఉన్న సమయంలో ఓ టిప్పర్ వారి మీదుగా దూసుకుపోవడంతో ముసలినాయుడితో పాటు మరో సన్నిహితుడు మృతిచెందారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ప్రమాదంలో ముసలినాయుడు దుర్మరణం చెందినట్లు సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు కన్నతల్లి, గోపాలం, చెల్లెలు రాధ భోరున విలపించారు. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న కొడుకును కోల్పోయిన వారి రోదన వర్ణనాతీతంగా ఉంది.

సంపత్ వినాయకుడ్ని దర్శించుకున్న కోలగట్ల



సంపత్ వినాయకస్వామిని దర్శించుకుంటున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: నగరంలోని మంటపం జంక్షన్ వద్ద కూరెళ్లవారి వీధిలో వేంచేసిన సంపత్ వినాయక ఆలయాన్ని డిప్యూటీ స్పీకర్, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ ధర్మకర్త యడ్ల పైడిరాజు, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ ధర్మకర్త యడ్ల పైడిరాజు కోలగట్లను సత్కరించి సంపత్ వినాయక చిత్రపటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ, విఘ్నాలు తొలగించే సంపత్ వినాయకుని ఆశీస్సులు ప్రతి ఒక్కరిపైనా ఉండాలన్నారు.

ప్రమాదంలో జింకకు గాయాలు

సీతానగరం: మండలంలోని జోగింపేట గురుకుల విద్యాలయం సమీపంలో ఉన్న తోట గేటును ఢీకొట్టడంతో ఓ జింక బలంగా గాయపడింది. శనివారం సాయంత్రం కొండ నుంచి బయటకు వచ్చిన జింక రాష్ట్ర రహదారిని అనుకుని ఉన్న మామిడి తోటలోకి వెళ్తున్న సమయంలో వాహనాలు తిరుగాడుతుండడంతో కంగారుగా వెళ్లి ఇనుప గేటును ఢీకొట్టి గాయపడింది. దీనిపై స్థానికులు అటవీశాఖ అధికారి సత్యనారాయణకు సమాచారం ఇచ్చారు.

చేసిన మంచే గెలిపిస్తుంది..

- ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు

నెల్లిమర్ల రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేసిన మంచి కార్యక్రమాలే వైఎస్సార్‌సీపీని మళ్లీ గెలిపిస్తాయని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. మండలంలోని మొయిదలో శనివారం ఆయన మాట్లాడుతూ, కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందని చెప్పారు. రాష్ట్రంలో ఫ్యాన్ హవా కొనసాగుతోందని, ప్రజలంతా జగనన్న వైపే ఉన్నారని స్పష్టం చేశారు. సోమవారం జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యాలని కోరారు.

ఆపదలోనూ అండగా..

- కోవిడ్ సమయంలో విశేష సేవలందించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- సకాలంలో వైద్యసేవలు అందడంతో నిలిచిన ప్రాణాలు
- గ్రామాల్లోనే కోవిడ్ పరీక్షలు
- జిల్లా వ్యాప్తంగా 5 లక్షలకు పైగా కోవిడ్ పరీక్షలు
- 38 క్వారంటైన్ సెంటర్ల ఏర్పాటు
- వ్యాధిగ్రస్తులకు ఆర్థికసాయం



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంట్



కోవిడ్ పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

విజయనగరం ఫోర్ట్: కరోనా (కోవిడ్) మహమ్మారి రెండేళ్ల పాటు యావత్ ప్రపంచాన్ని వణికించింది. జ్వరం, జలుబు, దగ్గు వచ్చిందింటే చాలు జనం హడలిపోయేవారు. ఒక ప్రాంతంలో కోవిడ్ కేసు నమోదయితే ఆ ప్రాంతానికి కూడా ఎవ్వరూ వెళ్లేవారు కాదు. ఆ సమయంలో కరోనా లక్షణాలతో ఎంతోమంది మృత్యువాత పడ్డారు. ఇళ్ల నుంచి కూడా బయటకు రావడానికి భయపడుతున్న రోజుల్లో జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు అండగా నిలిచింది. ప్రజల ప్రాణాలకు భరోసా కల్పించింది. కోవిడ్ బారిన పడిన వారు ఆత్మస్థైర్యం కోల్పోకుండా అవసరమైన చికిత్సను సకాలంలో అందించింది. దీంతో ఎంతోమంది ప్రాణాలతో బయటపడ్డారు.

గ్రామస్థాయిలోనే కోవిడ్ పరీక్షలు

ఎక్కువ మందికి కోవిడ్ పరీక్షలు చేయడం ద్వారా కోవిడ్ వ్యాప్తిని అరికట్టవచ్చుననే ఉద్దేశంతో జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం గ్రామస్థాయిలోనే కోవిడ్ పరీక్షలు చేసింది. దీంతో వ్యాప్తిని తగ్గించగలిగారు. గ్రామాలతో పాటు పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, జిల్లా ఆస్పత్రుల్లో పరీక్షలు అధికంగా చేశారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 5 లక్షలకు పైగా కోవిడ్ పరీక్షలు నిర్వహించారు.

సకాలంలో చికిత్సతో నిలిచిన రోగుల ప్రాణాలు..

కోవిడ్ నిర్ధారణ అయిన వారికి ఇంట్లో ప్రత్యేకంగా ఉంచి మందులు అందించేవారు. ఎవరి పరిస్థితి అయినా ఆందోళనకరంగా ఉంటే అటువంటి వారిని ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. సకాలంలో పరీక్షలు నిర్వహించి, మందులు అందజేయడం వల్ల ఎంతోమంది ప్రాణాలు నిలిచాయి.

38 క్వారంటైన్ సెంటర్లు..

హోమ్ క్వారంటైన్‌లో చికిత్స పొందే అవకాశం లేని రోగుల కోసం జిల్లాలో క్వారంటైన్ సెంటర్లు ఏర్పాటు చేశారు. 108 అంబులెన్సుల ద్వారా రోగులను అక్కడకు తరలించి చికిత్సతో పాటు వసతి అక్కడే కల్పించారు. అదేవిధంగా పౌష్టికాహారం అందించారు. 14 రోజుల తర్వాత ఎంతో మంది మెరుగైన ఆరోగ్యంతో ఇళ్లకు వెళ్లారు.

ప్రతి ఆస్పత్రిలో ఆక్సిజన్ ట్యాంక్‌లు..

కోవిడ్ రోగులకు ప్రధాన సమస్య శ్వాస ఆడకపోవడం. వీరికి ఆక్సిజన్ అత్యంత అవసరం. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం కోవిడ్ రోగులకు చికిత్స అందించే ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులతో పాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లోను ఆక్సిజన్ ట్యాంక్‌లు ఏర్పాటు చేశారు. ఆక్సిజన్ ట్యాంక్‌లు ఏర్పాటు చేయకముందు ఆక్సిజన్ కాన్సంట్రేటర్స్ ద్వారా రోగులకు ఆక్సిజన్ అందించారు. కోవిడ్ పరీక్షలు, చికిత్స, క్వారంటైన్ సెంటర్ల నిర్వహణ కోసం ప్రభుత్వం జిల్లాలో రూ. 50 కోట్ల వరకు ఖర్చు చేసింది.

ఆర్థికసాయం..

కోవిడ్ వల్ల ప్రజలు పనులు కూడా చేసుకోలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో ప్రజలు ఇబ్బంది పడకుండా ప్రభుత్వం నిత్యావసర వస్తువులు అందించింది. అంతేకాకుండా ప్రతి ఒక్కరికీ రూ. 1000 చొప్పున ఆర్థిక సాయం అందజేశారు.

ప్రభుత్వమే బతికించింది..

జ్వరం, దగ్గు, ఆయాసం ఉందని కోవిడ్ పరీక్ష చేయించుకుంటే పాజిటివ్ అని వచ్చింది. 108 అంబులెన్స్ ద్వారా జేఎన్‌టీయూలో ఏర్పాటు చేసిన క్వారంటైన్ సెంటర్‌లో చేరాను. అక్కడ 14 రోజులు పాటు ఉంచి చికిత్స అందించారు. ప్రభుత్వమే నన్ను బతికించింది.

– వేచలపు దేముడు, పెదవేమలి గ్రామం, గంట్యాడ మండలం

ఈవీఎంల స్వీకరణకు ఏర్పాట్లు

- రిసెప్షన్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ నాగలక్ష్మి



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ పూర్తయిన అనంతరం జిల్లాలోని వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఎన్నికల సిబ్బంది తీసుకువచ్చే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను (ఈవీఎంలు) స్వీకరించేందుకు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రాల్లో ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈవీఎంలు భద్రపరిచేందుకు, ఓట్ల లెక్కింపు కోసం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశాల మేరకు లెండి ఇంజినీరింగ్ కళాశాల, జేఎన్‌టీయూ జీవీ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాట్లు చేస్తున్నారు. లెండి ఇంజినీరింగ్ కళాశాలలో రాజాం, నెల్లిమర్ల, చీపురుపల్లి, గజపతినగరం, ఎస్.కోట నియోజకవర్గాల స్ట్రాంగ్ రూమ్‌లు, రిసెప్షన్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. జేఎన్‌టీయూ జీవీలో విజయనగరం, బొబ్బిలి నియోజకవర్గాల స్ట్రాంగ్‌రూమ్‌లు, రిసెప్షన్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ రెండు ప్రదేశాల్లో వర్షానికి ఇబ్బంది పడకుండా రోడ్లు భవనాల శాఖ ఎస్ఈ విజయరత్నం ఆధ్వర్యంలో ప్రత్యేక జర్మన్ హ్యాంగర్లను ఏర్పాటు చేశారు. ఒక్కో నియోజకవర్గానికి పది సాధారణ కౌంటర్లు ఏర్పాటు చేసి ఎన్నికల సామగ్రి స్వీకరించేలా ఏర్పాట్లు చేశారు. అలాగే అదేరోజు రాత్రి జేఎన్‌టీయూ జీవీలో భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదిలా ఉంటే జేఎన్‌టీయూ జీవీ, లెండి ఇంజినీరింగ్ కళాశాలను కలెక్టర్ నాగలక్ష్మి శనివారం పరిశీలించి ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు.

గడ్డిమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

సీతానగరం: మండలంలోని బూర్జ గ్రామానికి చెందిన చెందాన అప్పలనాయుడు(68) గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అప్పలనాయుడు కొంతకాలంగా కడుపు నొప్పితో ఇబ్బందులు పడుతున్నాడు. వైద్యం చేయించుకున్నప్పటికీ ఫలితంలేకపోవడంతో బాధను తట్టుకోలేక పంటలో కలుపు నివారణకు తెచ్చిన గడ్డిమందు శుక్రవారం సాయంత్రం తాగేశాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు తిరుపతిరావు ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అందరూ అప్రమత్తంగా ఉండాలి

- అడిషనల్ ఎస్పీ నరేష్‌బాబు



మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ నరేష్‌బాబు

సాలూరు: ఎన్నికల వేళ నియోజకవర్గంలో శాంతిభద్రతలకు విఘాతం కలగరాదని, అందరూ అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ ఎస్పీ ఆపరేషన్ ఆక్టోపస్ నరేష్‌బాబు తెలిపారు. ఈ మేరకు శని వారం ఆయన సాలూరు పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.సాలూరు పట్టణం, మండలం, పాచిపెంట, మక్కువ మండలాల్లో 143 పోలింగ్ లొకేషన్లలో ,193 పోలింగ్ స్టేషన్లను మొత్తం 26 సెక్టార్లుగా విభజించినట్లు తెలిపారు. డీఎస్పీ, సీఐ, ఎస్సై, ప్రత్యేక బలగాలు తదితర 350 మంది పోలీస్ సిబ్బంది విధుల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. క్రిటికల్ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పునరావాస కాలనీల్లో.. సకల సౌకర్యాలు

- రూ. 30 కోట్లతో మౌలిక సదుపాయాలు
- ఒక్కో కుటుంబానికి 5 సెంట్ల స్థలంతో పాటు రూ.9.20 లక్షల చొప్పున ఆర్థిక సాయం
- సంతోషం వ్యక్తం చేస్తున్న నిర్వాసితులు



గూడెపువలస ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో నిర్వాసితులు నిర్మించుకున్న గృహాలు



గూడెపువలసలో కాలనీలో నిర్మించిన అంగన్‌వాడీ భవనం



గూడెపువలలో నిర్వాసితురాలు నిర్మించుకున్న ఇల్లు

భోగాపురం: మెరుగైన సదుపాయాలతో భోగాపురంలో అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం నిర్మిస్తున్నారు. ఢిల్లీ, చెన్నై, హైదరాబాద్ విమానాశ్రయాలతో సరితూగే విమానాశ్రాన్ని జీఎంఆర్ సంస్థ రూపొందిస్తోంది. విమానాశ్రయం పనులు ప్రస్తుతం జోరుగా సాగుతున్నాయి. ఇదిలా ఉంటే విమానాశ్రయానికి భూములిచ్చిన రైతులు, గృహాలు కోల్పోయిన నాలుగు గ్రామాల ప్రజలకు ప్రభుత్వం అండగా నిలిచింది. భూములు కోల్పోయిన వారికి పూర్తిగా పరిహారం అందజేయగా..గృహాలు కోల్పోయిన బొల్లింకలపాలెం, రెల్లిపేట, మరడపాలెం, ముడసర్లపేట గ్రామాలకు చెందిన సుమారు 373 కుటుంబాలకు గూడెపువలస రెవెన్యూ పరిధిలోని 17 ఎకరాల్లో.. పోలిపల్లి రెవెన్యూ పరిధి లింగాలవలసలోని 25 ఎకరాల్లో ఇళ్లు నిర్మించింది. విశాలవంతమైన సీసీ రోడ్లు, విద్యుత్, కాలువలు, ప్రభుత్వ పాఠశాలలు, ఆలయాలు, శ్మశానవాటికలు, పార్కులు, ప్రతి ఇంటికి తాగునీటి కుళాయిలు వంటి సకల సదుపాయాలతో పునరావాస కాలనీలు ఏర్పాటు చేసింది. ప్రతి నిర్వాసిత కుటుంబానికి ఐదు సెంట్ల స్థలంతో పాటు రవాణా చార్జీలతో కలిపి రూ.9.20 లక్షలు చెల్లించింది. దీంతో నిర్వాసితులు ఆయా పునరావాస కాలనీల్లో విశాలమైన ఇళ్లు నిర్మించుకుని సంతోషంగా జీవనం సాగిస్తున్నారు.

ఎన్నో ప్రయోజనాలు ..



ఎక్కడో మారుమూల ఉన్న మా ప్రాంతం విమానాశ్రయం ఏర్పాటుకు ఇచ్చాం. ప్రభుత్వం మాకు పునరావాస కాలనీ ఏర్పాటు చేసి సకల సౌకర్యాలు కల్పించడం అభినందనీయం. గతంలో విద్య, వైద్యానికి నానా అవస్థలు పడే మాకు.. ఈరోజు జాతీయ రహదారికి ఆనుకుని అన్ని సౌకర్యాలు కల్పించారు.

– సబ్బి సూరమ్మ, నిర్వాసితురాలు, మరడపాలెం గ్రామం



లింగాలవలస ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో నిర్మించిన ప్రాథమిక పాఠశాల

మరో బంజారాహిల్స్..



విమానాశ్రయ నిర్మాణంలో భాగంగా భూములు, గృహాలు కోల్పోయిన మేము ప్రారంభంలో చాలా బాధపడ్డాం. అయితే మొదట్లో లింగావలస వద్ద ఇచ్చిన నిర్వాసిత కాలనీ ప్రదేశాన్ని చూసి కొంత బాధపడ్డాం. ప్రభుత్వం ఈరోజు అదే కాలనీలో విద్యుత్, ఇంటింటికీ తాగునీరు, గుడి, బడి, పార్కు, సూపర్ కాంప్లెక్స్ వంటి సకల సౌకర్యాలను ఏర్పాటు చేసింది. ఈ రోజు కాలనీలో జరుగుతున్న నిర్మాణాలు చూస్తుంటే హైదరాబాద్‌లో ఉన్న బంజారాహిల్స్‌ను తలపిస్తోంది.

– కొండపు నాగరాజు, నిర్వాసితుడు, మరడపాలెం గ్రామం



లింగాలవలసలో నిర్వాసితురాలు నిర్మించుకున్న ఇల్లు

విశాలమైన ఇల్లు కట్టుకున్నా..



మా ప్రాంతానికి విమానాశ్రయం రావడంతో మా గ్రామానికి మోక్షం కలిగిందని చెప్పొచ్చు. అయితే గ్రామం నుంచి విడదీయరాని బంధం ఉన్నప్పటికీ ఏదో ఒకరోజు గ్రామాన్ని వదిలి పెట్టాలని ముందే అనుకున్నాం. ఈక్రమంలోనే ప్రభుత్వం అన్ని సదుపాయాలతో ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ఏర్పాటు చేసింది. అందులో ప్రభుత్వం ఇచ్చిన 5 సెంట్ల స్థలంలో విశాలవంతమైన గృహాన్ని కట్టుకుని ఈ రోజు సంతోషంగా గడుపుతున్నాం.

– బొల్లింకల తోటమ్మ, నిర్వాసితురాలు, బొల్లింకలపాలెం గ్రామం

విదేశీ మద్యం పట్టివేత



మద్యం బాక్సులతో బిబేంద్ర పండా

- ఒకరి అరెస్టు

మల్కన్‌గిరి: విదేశీ మద్యం కలిగి ఉన్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. మల్కన్‌గిరి సమితి తండికి గ్రామంలోని కమాలేష్ వర్మ ఇంట్లో విదేశీ మద్యం ఉన్నట్టు వచ్చిన సమాచారం మేరకు ఎక్సైజ్ పోలీసు ఇన్‌స్పెక్టర్ బిబేంద్ర పండా తన సిబ్బందితో శనివారం దాడులు నిర్వహించారు. 12 బాక్సుల్లో ఉన్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కమాలేష్ వర్మను అరెస్టు చేశారు. ఎన్నికల అనంతరం కోర్టులో హాజరు పరస్తామని బిబేంద్ర పండా తెలిపారు.

రాయల్ బెంగాల్ టైగర్ మృతి



నందన్ మృతిపై సంతాపం ప్రకటించిన జూ సిబ్బంది

భువనేశ్వర్: బారంగ్ నందన్‌కానన్ జూలాజికల్ పార్క్‌కు చెందిన 17 ఏళ్ల రాయల్ బెంగాల్ టైగర్ నందన్ శనివారం మృతి చెందింది. దీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స దశలో మరణించినట్లు జూ అధికార వర్గాలు తెలిపాయి. నందన్ నడుము భాగంలో ఆర్థ్రైటిస్‌తో బాధపడుతూ నడవలేని స్థితిలో కుంగి పోయింది. ఫిబ్రవరిలో చికిత్స కోసం జూ వెటర్నరీ ఆస్పత్రికి తరలించారు. వెటర్నరీ ఆర్థోపెడిక్ నిపుణులు ప్రత్యక్షంగా ప్రత్యేక చికిత్స, వైద్య కార్యకలాపాలు నిర్వహించారు. ఈ పులి 2013లో చందక అభయారణ్యం నుంచి జంతుప్రదర్శనశాలలోకి చొరబడినట్లు జూ అధికారుల సమాచారం. నందన్ జూలో మేఘ అనే పులితో జత కట్టి 2016లో రెండు, 2021లో మూడు పిల్లలకు జన్మనిచ్చింది. గత నెలలో నందన్ కానన్ 14 ఏళ్ల తెల్ల పులి స్నేహను కోల్పోయింది. ఆకస్మిక అనారోగ్యంతో వృద్ధాప్య సంబంధిత అస్వస్థత, తీవ్రమైన వేడి గాలుల పరిస్థితులు కారణంగా నందన్ మరణించినట్లు అధికారులు భావిస్తున్నారు.

అందరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి

- మీడియాతో కలెక్టర్ నిషాంత్‌కుమార్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్ కుమార్, ఎస్పీ విక్రాంత్ పాటిల్

పార్వతీపురం టౌన్/పార్వతీపురం: జిల్లాలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిషాంత్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లపై శనివారం ఆయన కలెక్టరేట్‌లో మీడియా ప్రతినిధుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నిషాంత్ కుమార్ మాట్లాడుతూ ఓటుహక్కును తన అంతరాత్మ ప్రబోధం మేరకు వేయాలని, ఎటువంటి ప్రలోభాలకు గురికావద్దని కోరారు. యువత, మహిళలు, పీవీటీజీలు, థర్డ్ జెండర్ ఓటు హక్కు వినియోగానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ఎన్నికలకు ఇప్పటివరకు అన్ని ఏర్పాట్లు ప్రశాంతంగా, సజావుగా జరిగాయని చెప్పారు.

జిల్లా వ్యాప్తంగా 144వ సెక్షన్

జిల్లా వ్యాప్తంగా శనివారం సాయంత్రం నుంచి 144వ సెక్షన్ అమల్లోకి వస్తుందన్నారు. అభ్యర్థులు ఇంటింటి ప్రచారం చేసుకోవచ్చని, ఇంటింటి ప్రచారంలో లౌడ్ స్పీకర్ల వినియోగం లేదా ఎక్కువ మందితో ప్రచారం పాల్గొనడం నిషేధమని స్పష్టం చేశారు. సాయంత్రం 6 గంటల నుంచి మద్యం దుకాణాలను మూసివేయించారు. ఇది 13వ తేదీ రాత్రి 7 గంటల వరకు వర్తిస్తుందని వివరించారు. జిల్లాలో 604 ఎఫ్ఐఆర్‌లు నమోద య్యాయని, రెండు కోట్ల రూపాయల విలువైన 61 వేల మద్యం సీజ్ చేశామని, 2019 ఎన్నికలలో సీజ్ చేసిన దానికి ఇది పది రెట్లు అని వివరించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన కార్యకర్తలు ఎవరూ జిల్లాలో ఉండరాదన్నారు. నియోజకవర్గంలో ఓటు హక్కు ఉన్నవారు మాత్రమే ఉండాలని స్పష్టం చేశారు. లాడ్జిలు, వసతి అతిథి గృహాలను తనిఖీ చేస్తామని చెప్పారు. పోలింగ్ కేంద్రాలకు వంద మీటర్ల పరిధి వరకు మాత్రమే వాహనాలను అనుమతించనున్నట్లు చెప్పారు. ఓటరు సహాయానికి వేసే తాత్కాలిక టెంట్లు రెండు వందల మీటర్లు తరువాత మాత్రమే వేయాలని, అక్కడ పార్టీల జెండాలు, గుర్తులు, ప్రచారం ఉండరాదని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద సహాయకులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.